

చలివేంద్రాన్ని ప్రారంభించి నీటిని అందిస్తున్న ట్రస్టు కార్యదర్శి రాజు

గాలి అనిల్‌కుమార్ ట్రస్టు ఆధ్వర్యంలో చలివేంద్రం

చందానగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని గాలి అనిల్‌కుమార్ ట్రస్టు కార్యదర్శి రాజు అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం లింగంపల్లి బీహెచ్ఈఎల్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రం ప్రారంభోత్సవానికి రాజు ముఖ్యఅతిథిగా హాజరై పలువురికి తాగునీరు అందజేశారు. మండుతున్న ఎండలతో వాహనదారులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో తిక్కారెడ్డి, గణపతిరావు ఉన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ



చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ ఉషా ముళ్లపూడి కమాన్ వద్ద క్షత్రియ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజురోజుకూ ఎండలు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్షత్రియ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి బస్టాప్ వద్ద ఎన్ఎస్‌యూఐ జెండా ఎగురవేస్తున్న కాంగ్రెస్ నేతలు

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ వేడుకలు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావం సందర్భంగా కూకట్‌పల్లిలోని బస్టాప్ వద్ద వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు సాయితేజ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గూడెపు నాగరాజు జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గొల్ల జాన్, అరుణరెడ్డి, కావేటి నాగార్జున, రాకేష్, వంశీవర్ధన్, నిఖిల్, చందు, ఆదిత్య, దినేష్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలకు సన్నాహాలు



ఆదర్శనగర్‌లో సమావేశమైన బీఆర్ఎస్ నాయకులు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు మైనంపల్లి హన్మంతరావు, కొలన్ హన్మంత్‌రెడ్డిలు బీఆర్ఎస్ కింది స్థాయి నాయకులను, కార్యకర్తలను కలుస్తూ పార్టీలోకి ఆహ్వానించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌కు నాయకులను కాంగ్రెస్‌లోకి చేర్చేందుకు పట్నం మహేందర్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, కొలన్ హన్మంత్‌రెడ్డిలు పావులు కదుపుతున్నారు. మంగళవారం కొంపల్లి మున్సిపల్‌లోని మైనంపల్లి హన్మంతరావు ఇంట్లో మాజీ వైస్ చైర్మన్‌లు జయరామ్, లక్ష్మారెడ్డి, కో-ఆప్షన్ మాజీ సభ్యులు సయ్యద్‌రషీద్, కృష్ణగౌడ్, మీర్జా రవి కిరణ్ లతో మహేందర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి సమావేశం నిర్వహించి కాంగ్రెస్‌లో చేరాలని కోరారు. రంజాన్ పండుగ తరువాత కాంగ్రెస్‌లో చేరనున్నట్లు తెలుస్తోంది.

ఓటు హక్కుపై అవగాహన కోసం నేడు 5కే రన్

గచ్చిబౌలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు 5కే రన్ బుధవారం నిర్వహించనున్నారు. ఈ రన్ గచ్చిబౌలిలోని బొటానికల్ గార్డెన్ నుంచి మాదాపూర్‌లోని మెటల్ మినీ చార్మినార్ వరకు కొనసాగుతుందని శేరిలింగంపల్లి ఉపకమిషనర్ రంజిత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఓటరుగా ఉన్న ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభమవుతుందని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలి



వ్యాపారులకు ఉగాది పచ్చడి అందజేస్తున్న రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి, జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి సతీమణి సీతారెడ్డి మంగళవారం ఉదయం నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేస్తూ రంజిత్‌రెడ్డికి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, హఫీజ్‌పేట కార్పొరేటర్ పూజిత, నాయకులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం: కొండా



తుల్జాభవాని ఆలయంలో పూజలు చేస్తున్న కొండా విశ్వేశ్వరరెడ్డి

గచ్చిబౌలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని ఆయన శేరిలింగంపల్లి తారానగర్ మార్కెట్‌లోని తుల్జాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో తన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. శేరిలింగంపల్లిలో బీజేపీ బలంగా ఉందని, గత ఎన్నికల కంటే అత్యధిక మెజార్టీతో విజయకేతనం ఎగురవేస్తామన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలు చూపిస్తున్న రెండు సంస్థల ప్రతినిధులు

యూనివర్సిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో ఎస్కీ భాగస్వామ్యం

రాయదుర్గం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌తో ఇంజనీరింగ్ స్టాఫ్ కళాశాల భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఎస్కీలో జరిగిన కార్యక్రమంలో ఒప్పందంపై రెండు సంస్థల అధికారులు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రోజురోజు టెక్నాలజీ మారుతున్న నేటి ప్రపంచంలో ఆధునిక కోర్సులపై యువత మొగ్గు చూపుతున్నందున ఫుల్ స్టాక్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్స్‌లో భాగంగా ఫైవ్‌జీ టెక్నాలజీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, ఆర్టిఫిషల్ టెక్నాలజీ తదితర అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ చీఫ్ ఎమర్జింగ్ టెక్నాలజీ అసోసియేట్ వైస్‌చాన్సలర్ చంద్ర ఎస్‌దసక, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రసాద్, ఆర్‌డివి ప్రసాద్ పాల్గొన్నారు.

కనులపండువగా ఉగాది

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

జోన్‌బృందం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం కూకట్‌పల్లి, శేరిలింగపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో ప్రజలు ఆనందోత్సవాల మధ్య కనులపండువగా చేసుకున్నారు. పండుగ వైభవం ఉట్టి పడేలా హిందువులంతా సాంప్రదాయ దుస్తులు ధరించి, ఇంటి గుమ్మాలను మామిడి తోరణాలు, పూలతో అంకరించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందజేశారు. అదే విధంగా సంక్షేమ సంఘాలు, వివిధ అసోసియేషన్లు, దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో పంచాగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు హాజరై కొత్త సంవత్సరంలో ఆయా రాశుల గ్రహ, శుభ ఫలితాలను తెలుసుకున్నారు.

● **రాయదుర్గం:** శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ గచ్చిబౌలి రంగనాథస్వామి ఆలయంలో పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ లేబర్ సెల్ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, సురేందర్, రవీంద్రదూబే పాల్గొన్నారు.



కూకట్‌పల్లిలోని వేంకటేశ్వర ఆలయంలో భక్తులు





వెంకట్రామ్‌రెడ్డినగర్ ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నిజాంపేట్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నేత కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



చందానగర్ డివిజన్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ సాయిబాబా ఆలయం, రెడ్డికాలనీ రామాలయానికి అధిక సంఖ్యలో హాజరైన భక్తులు



ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో జన విజ్ఞాన వేదిక లైఫ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.



నిజాంపేట్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కొలన్ గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి



కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పండాల సతీష్‌గౌడ్, ఆవుల రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్



గాంధీభవన్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షుడు కెఎం ప్రతాప్‌గౌడ్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన డివిజన్ మహిళలు



కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఇన్‌చార్జి మైనంపల్లి హన్మంతరావుకు శుభాకాంక్షలు తెలిపిన కొలన్ హన్మంత్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు



గచ్చిబౌలి గోపన్‌పల్లి రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దంపతులు



ఆల్విన్‌కాలనీలోని తన కార్యాలయంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు



కూకట్‌పల్లి వెంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో బారులు తీరిన భక్తులు



కూన శ్రీశైలంగౌడ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న సాంటిరెడ్డి పున్నారెడ్డి, నాయకులు

చెరువులు, నీటిని కాపాడుకుందాం



చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు

దుండిగల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ప్రజలు నీటి అవసరాలను తీర్చడానికి, భవిష్యత్ తరాలకు నీటి సమస్య లేకుండా జీవించాలంటే హైదరాబాద్ చుట్టుప్రక్కల ఉన్న చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లో కుత్బుల్లాపూర్ మండల చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చెరువులను కాపాడుకోవడం, కూడికతీత పనులు చేపట్టడం, ఇంటింటికీ ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవడం ముఖ్యమని, వాటి ప్రాధాన్యతను ప్రజలు, ప్రభుత్వాలు గుర్తించే విధంగా కమిటీ సభ్యులు పని చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కమిటీ ఆధ్వర్యంలో నీటి ఆవశ్యకతపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని, చెరువుల పరిరక్షణ కోసం రాజకీయాలకు అతీతంగా పని చేస్తామన్నారు. చెరువులు, నీటిని కాపాడుకోవడానికి మేధావులు, యువకులు స్వచ్ఛందంగా కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉమామహేష్, రవీందర్ ముదిరాజ్, అశోక్‌రెడ్డి, యాకయ్య, రాజు, హరినాథ్, ప్రవీణ్ ఉన్నారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి



రాజేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సురవరం సుధాకర్‌రెడ్డి, నారాయణ

మియాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్‌లో సీఆర్ ఫౌండేషన్‌లో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, సీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ మాజీ జాతీయ కార్యదర్శి విజయలక్ష్మి, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కృష్ణ కుమారి, సలహాకమిటీ సభ్యులు డాక్టర్ సరస్వతి, రాజేందర్ రావు, మేనేజర్ శ్రీనివాస్, వృద్ధాశ్రమవాసులు పాల్గొన్నారు.

● **సీఎంకు కృతజ్ఞతలు**

సీఆర్ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ లీజును పునరుద్ధరించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి సురవరం సుధాకర్‌రెడ్డి, నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా లీజు పునరుద్ధరణ గత ప్రభుత్వం ఇవ్వలేదని పేర్కొన్నారు.

ఏఐ, ఎంఎల్‌పై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, ఐ హబ్‌డేటా, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలల నుంచి అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారి కోసం ఏఐ, ఎంఎల్‌పై ఆరునెలల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ట్రిపుల్‌ఐటీ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. ఆరునెలల శిక్షణలో ఏఐ, ఎంఎల్, సిద్ధాంతం, ట్యుటోరియల్‌లు, ప్రాజెక్టులకు సంబంధించిన కాన్సెప్ట్‌ల వివేకవంతమైన మిక్స్ ఉన్నాయని తెలిపారు. ఈ శిక్షణ కోసం నమోదు చేసుకునేందుకు మే 5లోపు దరఖాస్తు చేసుకోవాలని మే 19 నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ట్రిపుల్‌ఐటీ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.

చట్టసభల్లో క్రైస్తవుల ప్రాతినిధ్యం పెంచేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సీబీ అధ్యక్షుడు జాన్ మాస్క్

పంజాగుట్ట, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో క్రైస్తవుల ప్రాతినిధ్యం పెంచేందుకు కృషి చేస్తామని నేషనల్ క్రిస్టియన్ బోర్డ్(ఎన్‌సీబీ) అధ్యక్షుడు జాన్ మాస్క్ తెలిపారు. మంగళవారం ఎర్రమంజిల్‌లోని హోటల్ మెర్క్యూరిలో క్రిస్టియన్ మతపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, పాస్టర్లపై అక్రమ కేసులు, పరిష్కారమార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా జాన్ మాస్క్ మాట్లాడుతూ మణిపూర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో క్రైస్తవులపై తీవ్రమైన దాడులు జరిగినా ఏ ఒక్క రాజకీయ పార్టీ ప్రశ్నించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో దేశ వ్యాప్తంగా 400కు పైగా సీట్లలో పోటీచేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. క్రైస్తవులపై దాడులు అరికట్టడంతో పాటు క్రైస్తవ ఆస్తుల కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని, ప్రతి రాష్ట్రంలో క్రైస్తవ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, పాస్టర్లపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, క్రిస్టియన్ బోర్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో క్రైస్తవ మత పెద్దలు పీటర్, జాన్ వెస్లీ, నవీన్ కుమార్, సురేష్, జాషువా సామెల్, డేవిడ్ మార్క్, కాశి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చని అందాలు

- వేసవిలో కూడా చల్లటి గాలి
- ఆహ్లాదంగా లోటస్ పాండ్ పార్క్
- ప్రవేశం ఉచితం



లోటస్‌పాండ్‌లోని సరస్సు

బంజారాహిల్స్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఒకప్పుడు కొండల ప్రాంతం. ముఖ్యంగా ఎమ్మెల్యే కాలనీలో ప్రస్తుతం పార్కు ఉన్న ప్రాంతంలో చుట్టూ ఎత్తైన గుట్టలు ఉండేవి. వర్షం పడినప్పుడు ఆ గుట్టల మీది నుంచి నీటితో ఇక్కడ కొలను ఏర్పడింది. కొండలను ఆనుకొని అందమైన భవంతులు నిర్మాణం అయ్యా యి. పర్యావరణ పరిరక్షణలో భాగం గా కొలను చుట్టూ ఓ పార్కు అభివృద్ధి చేయాలని అప్పటి పాలకులు నిర్ణయించారు. దాదాపు 30 ఎకరా ల స్థలం సేకరించారు. 1999లో పార్కు పనులు మొదలయ్యాయి. 2001లో దీన్ని సందర్శకుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చారు. చలికాలం మొదలు కాగానే కొలనులో తామర పువ్వులు పూస్తుండడం గమనించి జీహెచ్ఎంసీ ఈ పార్కుకు లోటస్‌పాండ్ అని నామకరణం చేసింది.

ప్రకృతి సోయగం

పార్కుకు వచ్చే వారికి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఇక్కడ సకల సదుపాయాలు కల్పించారు. పర్యావరణానికి ఏ మాత్రం ఆటంకం వాటిల్లకుండా ఉన్న సహజ వనరులను పచ్చని లోగిళ్లుగా మార్చారు. వాకర్స్ కోసం 1.2కిలో మీటర్ల పొడువు వాకింగ్ పాత్ ఏర్పాటు చేశారు. వాకింగ్‌పాత్‌కు రెండు వైపులా పచ్చటి చెట్లు ఆహ్లాదాన్ని ఇస్తుంటాయి. అడవికి వెళ్లిన అనుభూతిని పంచుతుంది. మధ్య మధ్యలో చెక్క బ్రిడ్జిలు, కర్రలతో తయారు చేసిన షెడ్లు వంటి పార్కుకు అదనపు అందాలను తెచ్చి పెడుతున్నాయి. వర్షపు నీటితోనే కొలను నింపుతారు. వేసవిలో కూడా నీరు ఉంటుంది. వర్ష కాలం పూర్తయిన తరువాత పార్కు అందాలు మరింత అద్భుతంగా ఉంటాయని సందర్శకులు చెబుతున్నారు.

● సీజన్ బట్టి వలస పక్షులు పార్కుకు వస్తుంటాయి. నీటి కొలను వద్ద చెట్లపై సేద తీరుతుంటాయి. లిటిల్ గ్రెబి, కామన్ కూట్, వైట్ వాగ్‌టైల్, లిటిల్ ఎగ్రెట్, పైడ్ కింగ్ ఫిషర్, కామన్‌మూన్‌హెన్, సన్ బర్డ్ తదితర జాతుల పక్షులు కనువిందు చేస్తుంటాయి. అంతేకాదు వేప, కస్టర్ ఆపిల్, బాంబూ, సింగపూరే చెర్రి, ఆస్ట్రేలియన్ తుమ్మ వంటి చెట్లు ఇక్కడ కనిపిస్తాయి.

● లోటస్‌పాండ్‌కు జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ మీదుగా వెళ్లవచ్చు. బస్సులో ఎమ్మెల్యే కాలనీ వరకు వచ్చి అక్కడినుంచి కొద్ది దూరం వెళ్తే పార్క్‌కు చేరుకోవచ్చు. రోజూ ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పార్క్ తెరిచి ఉంటుంది. పార్కింగ్ చేసుకునే వసతి ఉంది.

చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్థుడి అరెస్ట్



మాట్లాడుతున్న మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వరరావు

చార్మినార్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలు చేసి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని భవానీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నాలుగు ద్విచక్ర వాహనాలు, రెండు ఏసీ కంప్రెసర్లు స్వాధీనం చేసుకొన్నారు. మంగళవారం భవానీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వరరావు భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి, ఎస్‌ఐ అంకిరెడ్డి వివరాలు వెల్లడించారు, అమన్‌నగర్, మౌలాకాచిల్లా ప్రాంతానికి చెందిన మహ్మద్ మోహసిన్ షరీఫ్ డిగ్రీ వరకు చదివాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బు కోసం దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఈనెల 7న తలాబ్‌కట్టలోని కూల్ కేర్ కూలింగ్ సిస్టంలో రెండు ఏసీ కంప్రెసర్లు చోరీకి గురయ్యాయి. యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న భవానీనగర్ పోలీసులు సీసీ టీవీ ఫుటేజిలను పరిశీలించి మహ్మద్ మోహసిన్ షరీఫ్ చోరీ చేసినట్టు గుర్తించారు. అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్టు అంగీకరించాడు. ఎల్బీనగర్, మంగళహాట్, షాహిమ్‌గంజ్‌లో ద్విచక్రవాహనాలు చోరీచేసినట్టు చెప్పాడు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ఉప్పల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రామంతాపూర్ పీఎస్ కాలనీకి చెందిన సత్యభాస్కర్‌రెడ్డి(34) ప్రైవేట్ ఉద్యోగి. సోమవారం సాయంత్రం స్నేహితుడ్ని కలిసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లి అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటికి వస్తుండగా రామంతాపూర్ టీవీ స్టూడియో శివాజీ విగ్రహం వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని కిందపడ్డాడు. తీవ్రగాయాలైన సత్యభాస్కర్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో దంపతులపై దాడి

కొత్తపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కొందరు వ్యక్తులు దుర్భాషలాడుతూ దంపతులపై దాడి చేసిన ఘటన మంగళవారం సాయంత్రం ఎల్బీనగర్ పీఎస్ పరిధి హస్తినాపురం, షిర్డీ సాయినగర్‌లో చోటు చేసుకుంది. షిర్డీ సాయినగర్‌లోని ఓ భవనం మొదటి అంతస్తులో పీ.సైదాచారి, భారతి దంపతులు, గ్రౌండ్‌ఫ్లోర్‌లో యాదయ్య, అరుణ దంపతులు ఉంటున్నారు. యాదయ్య స్నేహితులలో కలిసి మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో మద్యం తాగి అసభ్యపదజాలంతో కేకలు వేశారు. దీంతో ఇరుగు, పొరుగు వారు అసౌకర్యానికి గురయ్యారు. సాయంత్రం యాదయ్య, అరుణ దంపతులు, స్నేహితులు సైదాచారి ఇంట్లోకి చొరబడ్డారు. అడ్డుకునేందుకు యత్నించిన సైదాచారి భార్య భారతిపై దాడి చేసి అసభ్యపదజాలంతో దూషించారు. పక్కింట్లో ఉండే భరత్‌కుమార్‌కు చెందిన కంప్యూటర్‌ను ధ్వంసం చేశారు. భవనం ఆవరణ మందుబాబుల అరుపులు, కేకలతో దద్దరిల్లింది. భారతి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో నిద్రించే స్థలం విషయమై గొడవ

ఘర్షణలో ఒకరి మృతి



కామ్‌సింగ్ మృతదేహం

పహాడి షరీఫ్ ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ కాలనీలోని పోచమ్మ ఆలయంలో నిద్రించే స్థలం కోసం జరిగిన గొడవలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. మహారాష్ట్రకు చెందిన కామ్‌సింగ్ కూలి పని చేస్తుంటాడు. సోమవారం అర్ధరాత్రి శ్రీరామ్‌కాలనీలోని పోచమ్మ ఆలయం వద్ద నిద్రపోయాడు. అదే కాలనీకి చెందిన కూలి పనులు చేసే నేనావత్ రోజూ రాత్రి సమయంలో పోచమ్మ ఆలయంలో నిద్రపోతాడు. తాను నిద్రపోయే స్థలంలో సోమవారం రాత్రి కామ్‌సింగ్ పడుకోవడంతో ఆగ్రహం చెందాడు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని కోరాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపంతో నేనావత్ కర్రతో కామ్‌సింగ్ తలపై బలంగా కొట్టాడు. తీవ్రగాయం కావడంతో కామ్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో పహాడిషరీఫ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భాస్కర్ తెలిపారు.